క్లుప్తంగా

ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన బీమా చెక్కు అందజేత



మృతుడి భార్య రత్నానికి చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం ఎంవీవీఎం కృష్ణ

అమలాపురం రూరల్: ముక్తేశ్వరం భారతీయ స్టేట్ బ్యాంకులో సేవింగ్ అకౌంట్ కలిగిన అజ్జరపు సత్యనారాయణ ఆకస్మికంగా మృతి చెందడంతో అతని భార్య అజ్జరపు రత్నానికి రూ.2 లక్షల ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును గురువారం అమలాపురం స్టేట్ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎమ్‌వీవీఎం కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం రీజినల్ మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పాలసీకి స్టేట్ బ్యాంకు ఖాతాదారుడు ప్రతి ఏడాది రూ.436లు చెల్లించాలని తద్వారా పాలసీ ఆటో రెన్యువల్ అవుతుందన్నారు. ఇలా డబ్బులు కట్టి పాలసీ తీసుకున్న ఖాతాదారుడు ఏ కారణంవల్ల అయినా మరణిస్తే జీవిత బీమా కింద రూ.2 లక్షలు ఆ కుటుంబ సభ్యులకు గానీ, నామినీకి గానీ అందజేస్తారని వివరించారు. ఈ పాలసీకి 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల ఖాతాదారు అర్హులని అన్నారు. కార్యక్రమంలో ముక్తేశ్వరం బ్రాంచ్ మేనేజర్ కేవీ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న సీపీఎం కార్యవర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

అమలాపురం రూరల్: కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద గురువారం సీపీఎం పార్టీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం కార్యవర్గ సభ్యురాలు కె. సుబ్బరావమ్మ మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరకులను అందుబాటు ధరలకు అందించాలన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతున్నారని అన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే కృష్ణవేణి, జి దుర్గాప్రసాద్, ఎస్.బలరాం, కే.నాగ వరలక్ష్మి, జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల ఆకస్మిక తనిఖీ



వన్నెచింతలపూడి హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్ : మండలంలో వన్నెచింతలపూడి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కే సలీంబాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొద్దిసేపు విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఉద్బోధించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. డీఈఓ వెంట సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశరావు, హెచ్‌ఎం నాగ సత్యనారాయణ ఉన్నారు.

రూ.18 లక్షలతో స్విమ్మింగ్‌పూల్ ఆధునీకరణ

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ వెల్లడి



డాక్టర్ వైఎస్సార్ స్టేడియం ఆవరణలో స్విమ్మింగ్‌పూల్ ఆధునీకరణ పనులు

యానాం: పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఇండోర్‌స్టేడియం ఆవరణలో రూ.18 లక్షలతో స్విమ్మింగ్‌పూల్ ఆధునీకరణ పనులను గురువారం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గత 12 ఏళ్లుగా ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో స్విమ్మింగ్ పోటీలకు వెళ్లే క్రీడాకారులు, శిక్షణ తీసుకునే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు, పీఈటీలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. పుదుచ్చేరి విద్యాశాఖమంత్రి నమశ్శివాయం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణం స్పందించి స్విమ్మింగ్‌పూల్ పనులకు ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరేళ్లుగా ఉప్పు బారిన వరిచేలు

అనధికారిక పైపులతో వరి చేల్లోకి ఉప్పునీరు



కొమరగిరిపట్నంలోని వరి చేలల్లో గయాళ్లుగా మారిన ఉప్పునీరు

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని 4వ నంబర్ కాలువపై సాగు చేస్తున్న 280 ఎకరాల్లో ఉప్పునీరు వచ్చి సాగుకి పనికి రాకుండా పోతుందని కొమరగిరిపట్నం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచనీటి డ్రైను నుంచి గుర్రం వారి పొలాల వరకు వ్యవసాయ క్షేత్రాల్లోకి ఉప్పునీరు ఎదురెక్కి ఆరేళ్లుగా వ్యవసాయ భూములు చౌడుబారి పోయాయి. గత ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవ తీసుకుని పంచనీటి కాలువపై అనధికారికంగా ఏర్పాటు చేసిన పైపుల నుంచి ఉప్పునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

దీంతో ఇరిగేషన్ అధికారులు ఏఈ రెహమాన్ ఆధ్వర్యంలో ఉప్పునీరు రాకుండా జేసీబీ సాయంతో అడ్డకట్టు వేశారు. అయితే అనధికార పైపులను తొలగించకపోవడంతో ఉప్పునీరు యథావిధిగా వరి చేలల్లోకి వస్తోంది. దీంతో నాట్లు వేసే పరిస్థితి కరువైంది. ప్రస్తుత ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరరావు ఎన్నికలకు ముందు పంచనీటి కాలువ నుంచి ఉప్పునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గుడుస్తున్నా ఎన్నికల హామీని అమలు చేయలేదు. దీంతో రైతులు దాళ్వా సాగుపై ఆశలు వదులకున్నారు. పంచీనీటి డ్రైనుపై అనధికారిక పైపులతో వ్యవసాయ క్షేత్రాలు చౌడు భూములుగా మారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి పంచనీటి కాలువపై ఉన్న అనధికార పైపులు తొలగించాలని కోరుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం

మంచినీటి కాలువ ఆనుకొని ఉన్న వ్యవసాయ పొలాల్లోకి ఉప్పునీరు చేరి గత ఆరేళ్లుగా వరిసాగు జరగడం లేదు. నాకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో జమ్మిగడ్డి పెరిగిపోయి బీడు భూమిగా మారింది. ఈ వ్యవసాయ పొలాలను నమ్ముకొని సుమారు వంద మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం చూపలేదు.

గుర్రాల కొండలరావు, కొమరగిరిపట్నం.

స్పేస్‌ల్యాబ్‌తో విద్యార్థుల మేధస్సుకు మేలు

స్పేస్ ల్యాబ్ ప్రారంభించిన డీఈవో



స్పేస్‌ల్యాబ్ ప్రారంభోత్సవంలో డీఈవో సలీంబాషా తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం సమనస ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్పేస్ ల్యాబ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కె.సలీంబాషా గురువారం ప్రారంభించారు. డీపీఎస్ డైరెక్టర్ నంద్యాల మనువిహార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పేస్‌ల్యాబ్ ను ప్రారంభించిన అనంతరం డీఈవో మాట్లాడుతూ.. ఇటువంటి ల్యాబ్ ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ సూర్య చంద్రులు, నక్షత్రాల పరిశోధనలకు ఈ సైన్స్‌ల్యాబ్ విద్యార్థులకు ఎంతోగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద్యాల నాయుడు, పాఠశాల డైరెక్టర్ స్నేహప్రియ, సీఎమ్‌ఓ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆర్‌ఏఓ మునిస్వామి



కాకినాడ కలెక్టర్ షన్మోహన్‌ను సత్కరిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: తాళ్లరేవు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని గురువారం యానాం ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చిన కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా యానాం వచ్చిన కలెక్టర్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు. కేంద్రపాలిత ప్రాంతం యానాంకు సంబంధించిన విశేషాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం కలెక్టర్ కాకినాడ బయలుదేరి వెళ్లారు.

యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎంపీ హరీష్



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్

ముమ్మిడివరం: యువత విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు. ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ స్టూడెంట్స్‌ను ఆయన అభినందించారు. కాకినాడ పీఆర్ కళాశాల విద్యార్థి అప్పడి సత్యన్నారాయణ, ఎస్‌కేబీఆర్ కాలేజీ విద్యార్థి సంసాని నాగ సత్యన్నారాయణ, కాకినాడ సూరంపాలెం ఆదిత్య కాలేజీ విద్యార్థి డి.వేణు మణకంఠ, స్కూల్ గేమ్స్ అండర్-17 పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన ముమ్మిడివరం ఎంజీఆర్ కాలేజీ ఇంటర్ విద్యార్థులు పి.రమేష్, ఏ.సత్యన్నారాయణ, సాగర్‌లకు మెడల్స్ వేసి అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో మెడల్స్ సాధించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో కోచ్ వాసంశెట్టి నరేష్, గున్నేపల్లి సర్పంచ్ గొలకోటి దొరబాబు, గెద్దం శ్రీను, పితాని నరసింహమూర్తి, దొంగ గంగాధర్ లు పాల్గొన్నారు.

ఆధార్‌ను విధిగా లింక్ చేయించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ, పెన్షన్లు, ఉపకార వేతనాలతో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధిని పొందేందుకు ప్రజలు తమ ఆధార కార్డును బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు విధిగా లింక్ చేయించుకోవాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయంలో దాదాపు 600 మంది చొప్పున పట్టణం మొత్తం మీద సుమారు 8 వేల మంది తాలూకా ఆధార్ లింకు ప్రక్రియ పూర్తి కాలేదని స్పష్టం చేశారు. ఆధార్ లింకు చేయించుకునేందుకు ప్రతి వార్డు సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, పోస్టాఫీసు సిబ్బంది ప్రత్యేకంగా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ నెల 16వ తేదీలోగా లబ్ధిదారులు వారి వ్యక్తిగత అకౌంట్లకు ఆధార్ లింకు చేయించుకోవాలన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఆ గ్రామానికి చెందిన బండారు నాగరాజు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. అతని వద్ద 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చలు



మున్సిపల్ కమిషనర్ రాజుతో చర్చిస్తున్న యూనియన్ నాయకులు

అమలాపురం టౌన్: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కమిటీ ప్రతినిధుల బృందం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీఆర్ ఆర్ రాజు సమక్షంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై గురువారం చర్చించింది. కమిషనర్ చాంబర్‌లో ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు ఆధ్వర్యంలో సాగిన ఈ చర్చల్లో కార్మికుల సమస్యల పరిష్కార మార్గాన్ని చూపేందుకు కొంత గడువు అనివార్యమైంది. దీంతో కమిషనర్ రాజు మరోసారి చర్చలు నిర్వహిద్దామని తెలిపారు. అయినప్పటికీ కార్మికుల సమస్యలపై యూనియన్ ప్రతినిధుల బృందం కమిషనర్‌కు మరోసారి వివరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి, యూనియన్ నాయకులు కానేటి వెంకట్రావు, భవిరిశెట్టి రాంబాబు, దంగేటి శ్రీనివాసరావు, నిమ్మకాయల సత్యవతి తదితరులు కమిషనర్ రాజుతో కార్మిక సమస్యలపై చర్చించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఐ.పోలవరం: ప్రతి ఉద్యోగి సమయానికి విధులకు హాజరు కావాలని, ఫీల్డ్‌లోకి వెళ్లే సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని ముమ్మిడివరం కమిషనర్ పిన్నమరాజు రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో అవుట్‌సోర్సింగ్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెక్షన్‌హెడ్స్ చెప్పే పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ, పీవీ సుధాకర్, ఆర్ఐ భాస్కరరావు, జేఏవో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రాజు, సీనియర్ అకౌంటెంట్ సుబ్బారావు, సచివాలయ, నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రబీకి పూర్తిస్థాయిలో సాగునీటి సరఫరా చేయాలి

జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టాల ఆయకట్టు పరిధిలోని 2,71,658 ఎకరాలకు 2024- 25 రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేసేందుకు జిల్లాస్థాయి సలహా సంఘం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా సంఘ సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. 2024 -25 రబీ సీజన్‌కు సాగునీరు అందించేందుకు గోదావరి నదిలో పుష్కలంగా సాగునీటి నిల్వలు ఉన్నాయని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో సాగు నీటిని సరఫరా చేయాలని నీటిపారుదల సలహా సంఘం నిర్ణయించిందన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో తక్కువ కాల పరిమితి కలిగిన వంగడాల సాగును ప్రోత్సహిస్తూ వీలైనంత తక్కువ కాల వ్యవధిలో వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కాలువల చిట్టచివరి ఆయకట్టుకు సాగునీటి సమస్యలు ఉత్పన్నమైన సందర్భంలో డ్రైన్లలో 6 క్రాస్‌బండ్లు వేయడానికి ప్రతిపాదించామన్నారు. ప్రస్తుత రబీసీజన్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన 114 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు, డ్రైనేజీ విభాగం డీఈ ఎంవీఎస్ కిషోర్‌బాబు, జలవనరుల శాఖ డీఈ నాగేంద్ర కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయ, జల వనరుల విభాగాల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇసుక తవ్వకాలకు ఆదేశం



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఈ నెల 16 నుంచి జిల్లాలోని 12 ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గనులు, భూగర్భశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా, అస్సైన్డ్ భూములలో ఇసుక మేటలు తొలగింపు కొరకు ముందుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా సంయుక్త తనిఖీని ఆయా భూములలో నిర్వహించి మ్యాపులతో సహా నివేదిక సమర్పిస్తారని తెలిపారు. నివేదికను జిల్లాస్థాయి ఇసుక కమిటీకి పంపి అనుమతులు పొందాలన్నారు. అదేవిధంగా రైతుల లిఖిత పూర్వక అంగీకారంతో తవ్వకాలు మూడు కేటగిరీలలో చేపట్టడం జరుగుతుందన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు సంబంధించి త్వరలో పర్యావరణ అనుమతులు రానున్నాయని స్పష్టం చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తవ్వకాలను ఏజెన్సీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, ఆర్డీవోలు కె.మాధవి, పీ.శ్రీకర్, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, ఆర్టీఓ డి.శ్రీనివాసరావు, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టీ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్



ఆస్పత్రి స్థితిగతులను వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కాకినాడ కలెక్టర్ షన్మోహన్

తాళ్లరేవు: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన మండలకేంద్రం తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిపై అంతస్థులో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను వైద్యులు పలు కారణాలతో కాకినాడకు రిఫర్ చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ స్నేహలతను కలెక్టర్ ప్రశ్నించగా మత్తు వైద్యుడు లేని కారణంగా పలు కేసులను కాకినాడ రిఫర్ చేస్తున్నట్లు బదులిచ్చారు. ఆస్పత్రికి అనస్తీషియాతో పాటు జనరల్ ఫిజీషియన్‌ను త్వరలోనే నియమిస్తామని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ చొల్లంగిపేటలోని గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, తాళ్లరేవు సీహెచ్‌సీ డైరెక్టర్‌లు రొక్కం చక్రవర్తి, అత్తిలి బాబూరావు, వాకపల్లి సరోజిని, చిరంజీవి, చిట్టూరి చలపతి, చిక్కం చందు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోండి

- బ్యాంక్ ఆఫ్ బరోడా ఏజీఎం రవీంద్రనాథ్ ఠాగూర్
- తాళ్లరేవులో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించిన రవీంద్రనాథ్ ఠాగూర్

తాళ్లరేవు: సత్వర సేవలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయ అధికారి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ యస్.రవీంద్రనాథ్ ఠాగూర్ కోరారు. గురువారం తాళ్లరేవు సంతపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ తాళ్లరేవు శాఖా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించడంలో తమ బ్యాంకు ముందుంటుందని, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో శాఖా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 53 శాఖలు ఉన్నాయని, మొత్తంగా 8 వేల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని చెప్పారు. బీఓబీ వరల్డ్ అనే యాప్ ద్వారా అన్ని రకాల డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయని తాళ్లరేవు పరిసర ప్రాంత ప్రజలు బ్రాంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యాలయం, మేనేజర్ చాంబర్, స్ట్రాంగ్‌రూం, క్యాషియర్ రూములను ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్లరేవు శాఖ మేనేజర్ బి.సురేష్, బ్యాంకు ప్రతినిధులు శ్యాంకుమార్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, నాయకులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నారాయణ స్వామి వార్షికోత్సవం



లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన శివారు మర్రిచెట్టు కాలనీలో వేంచేసి యున్న శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో నాల్గవ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కార్తికమాస పర్వదినం, క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని కార్తిక దామోదరుడు శ్రీలక్ష్మీ నారాయణస్వామి కల్యాణాన్ని ఆలయ వ్యవస్థాపకులు మల్లాడి మహావిష్ణు భైరవ, మీరారాణి దంపతులతో అర్చకులు సుదర్శనం ఫణికుమార్ ఆచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు వైభవంగా జరిపించారు. శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

పుస్తక పఠనంతో మేలు

ఉప్పలగుప్తం: ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని ఎంఈవో సత్తి సత్యకృష్ణ అన్నారు. ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రంథాలయ శాఖల్లో నిర్వహించిన వారోత్సవాల్లో గురువారం ఆయన పాల్గొని పుస్తక పఠనం ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు. గ్రంథాలయాధికారులు నిమ్మకాయల శేషుకుమార్, సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేడుకగా బాలల దినోత్సవం

- పాఠశాలల్లో అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు
- విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



అమలాపురంలో సాంస్కృతిక ప్రదర్శనలతో అలరిస్తున్న చిన్నారులు



నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లాడి

అమలాపురం టౌన్: అమలాపురంలోని పలు విద్యాలయాల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వెనుక ఉన్న సర్ సీవీ రామన్ స్కూలు, గొల్లగూడెంలోని ఆదిత్య స్కూళ్లలో వేడుకలు జరిగాయి. ఆదిత్య స్కూలులో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శలను నిర్వహించి ఔరా అనిపించారు. దేశమాత వేషధారణలు, దేవతా మూర్తుల వేషధారణలతో రంజింపజేశారు. విద్యార్థులకు «బాలల ప్రగతి» అనే అంశంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆదిత్య స్కూలులో జరిగిన బాలల దినోత్సవానికి పట్టణ ఎస్సై కిషోర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదిత్య స్కూలు ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి, సర్ సీవీరామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. :

ఐ.పోలవరం: ముమ్మిడివరం మండలం ఠాణేలంక బాలికల గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు అమలాపురం జనకల్యాణ్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆర్థిక సహకారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ టి. గంగాభవాని అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా జనకల్యాణ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ కిశోర్, ప్రాజెక్టు మేనేజర్ శ్రీను, వైస్ ప్రిన్సిపల్ శివ ప్రవీణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలల హక్కులు, వాటి పరిరక్షణ గురించి వివరించారు.

ఐ.పోలవరం: స్థానిక కొత్తలంక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ బాబ్జి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గోవర్ధనగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని హిమబిందు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పిల్లలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

ఉప్పలగుప్తం: భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవాన్ని మండలంలోని ఆయా పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. భీమనపల్లి జెడ్పీ ఉన్న పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు.

యానాం: బాలల దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఉమెన్ అండ్ చైల్డ్ డెవలెప్‌మెంట్, విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆర్‌ఏఓ మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యి శ్రీను, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

అల్లవరం: ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ పైలెట్లు ఈ నెల 25 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మె నోటీసును తహసీల్దార్ నరంహరావుకి గురువారం అందించారు. 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థను మార్చిన ప్రతిసారి ఉద్యోగుల గ్రాట్యూటీ, సెలవుల సొమ్ము, వార్షిక ఇంక్రిమెంట్‌లు చెల్లించకుండా ఉద్యోగులను మోసం చేస్తున్నారని తెలిపారు. 108 ఉద్యోగులను వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12 గంటల పాటు విధులు నిర్వర్తించడంతో పనిభారం అవుతుందని వాపోయారు. ప్రతి నెల జీతాలు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిబ్బంది కొరత ఉందన్నారు. తమ న్యాయపరమైన 15 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురం టౌన్: ఇద్దరు బెల్ట్‌షాపు నిర్వాహకులను ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. ఆ ఇద్దర్నీ అంబాజీపేట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి ఎదుట హాజరు పరిచారు. తహసీల్దార్ వారిరువురికి తలా రూ.లక్ష చొప్పున షూరిటీ విధించారని అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురం ఎక్సైజ్ ఎస్సై బాలాజీ ఆ ఇద్దరు నిర్వాహకులను బైండోవర్ చేశారు.